# ఫూలే స్ఫూర్తితో బీఆర్ఎస్ పాలన

- సబ్బండ కులాల అభ్యున్నతికి కృషిచేశాం
- వ్యవసాయ, కులవృత్తులకు తొలిప్రాధాన్యమిచ్చాం..
- అదే స్ఫూర్తి కొనసాగిస్తేనే రాష్ట్రంలో ప్రగతి సాధ్యం
- జయంతినాడు ఫూలేను స్మరించుకున్న కేసీఆర్



హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): సామాజిక ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు ఫూలే స్ఫూర్తితో ప్రత్యేక తెలంగాణలో తొలి పదేండ్లు పాలన సాగించామని బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు తెలిపారు. సబ్బండ వర్ణాల అభ్యున్నతి కోసం ఆనాటి తమ ప్రభుత్వం ఫూలే ఆదర్శాలను కార్యాచరణలో పెట్టిందని కేసీఆర్ గుర్తుచేశారు. తొలి తెలంగాణ ప్రభుత్వం అమలుచేసిన కార్యాచరణను నేటి ప్రభుత్వం చిత్తశుద్ధితో కొనసాగించాలని సూచించారు. అప్పుడే తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలు, మైనార్టీ పేద వర్గాలకు ఫూలే దంపతుల ఆకాంక్షలు నిజమై, సామాజిక న్యాయం జరుగుతుందని కేసీఆర్ పేర్కొన్నారు. ఫూలే జయంతి సందర్భంగా ఆయన నివాళులర్పించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయం దాని అనుబంధ రంగాలే కేంద్రంగా, కుల వృత్తుల సామాజిక సాంస్కృతిక జీవన విధానం అల్లుకుని ఉన్నదని తెలిపారు. ఈ చారిత్రక నేపథ్యాన్ని అవగాహన చేసుకున్న నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అవే రంగాలను మొదటి పాలనా ప్రాధాన్యంగా తీసుకున్నట్టు పేర్కొన్నారు. అందుకే సామాజిక న్యాయం అందించడంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా ఆనాడు నిలిచిందని గుర్తుచేశారు. వర్ణ, కుల వివక్ష నుంచి విముక్తి కోసం తన జీవితకాలం పోరాడిన ఫూలే భారత సామాజిక విప్లవకారుడని కొనియాడారు. సబ్బండ కులాల అభ్యున్నతి కోసం, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి, త్యాగాలను మరువలేమని తెలిపారు. సామాజిక రుగ్మతలను రెండు శతాబ్దాల క్రితమే పసిగట్టి, పరిష్కారం కోసం కృషిచేసిన దార్శనికుడు ఫూలే అని ప్రశంసించారు.

### గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం

నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఫూలే స్ఫూర్తితో పదేండ్లపాటు ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా సాగునీరు, ఉచిత విద్యుత్తు, పంట పెట్టుబడికి రైతుబంధు, పంట కొనుగోలు చేయడం వంటి కీలక కార్యాచరణను సమాంతరంగా అమలు చేయడంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అయిందని కేసీఆర్ గుర్తుచేశారు. పేద ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగి వారిలో ఆర్థిక భరోసాను తాము పెంచామని తెలిపారు. తద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ.. దేశ ప్రగతిలో కీలక భూమికను పోషించిందని పేర్కొన్నారు. తద్వారా బీసీ, ఎస్సీ కులాల సామాజిక గౌరవాన్ని ఇనుమడింపజేసిందని తెలిపారు.

# ఫూలే బాటలో నడుద్దాం

- కేటీఆర్ సహా బీఆర్ఎస్ నేతల పిలుపు
- తెలంగాణభవన్‌లో జయంత్యుత్సవాలు
- ఫూలే చిత్రపటం వద్ద ఘననివాళులు

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తేతెలంగాణ): మహాత్మాజ్యోతిరావుఫూలే మార్గంలో నడుస్తూ ప్రతిఒక్కరూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడాలని కేటీఆర్ సహా బీఆర్ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఘనంగా ఫూలే జయంత్యుత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఆ మహనీయుడి సేవలను స్మరించుకున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు ఫూలే పేదల కోసం తన జీవితాన్ని ధారపోశారని కొనియాడారు. ఫూలే చూపిన బాటలో రాష్ట్రంలో 1,022 గురుకులాలను ఏర్పాటు చేసి, పేదింటి బిడ్డలకు నాణ్యమైన చదువునందించారని అన్నారు. విదేశాలకు వెళ్లిన 7వేల మంది బీసీ విద్యార్థులకు రూ. 20 లక్షల చొప్పున స్కాలర్‌షిప్‌లు మంజూరు చేసి వారి బతుకుల్లో వెలుగులు నింపారని గుర్తుచేశారు. జ్యోతిబా ఫూలేను అందరూ స్ఫూర్తిగా తీసుకొని సామాజిక సేవలో పాలుపంచుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. మాజీ మంత్రులు వీ శ్రీనివాస్‌గౌడ్, పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, కురువ విజయ్, కిశోర్‌గౌడ్, తుంగబాలు, అభిలాష్ రంగినేని, వై సతీశ్‌రెడ్డి, బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు బాబన్న, మారయ్య తదితరులున్నారు.



సిరిసిల్లలోని నేతన్న చౌరస్తాలో మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పార్టీ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు

# కేటీఆర్ వల్లే సిరిసిల్లకు టెక్స్‌పోర్టు ఇండస్ట్రీ

**బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి • టెక్స్‌పోర్టు ఏర్పాటుకు కృషి చేసిన కేసీఆర్, కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం**

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 11: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహకారంతోనే సిరిసిల్లలో టెక్స్‌పోర్టు ఇండస్ట్రీ అందుబాటులోకి వచ్చిందని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి పేర్కొన్నారు. మహిళలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతోనే అప్పారెల్ పార్క్‌లో పరిశ్రమలు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్‌లో గల నేతన్న చౌరస్తాలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పార్టీ నాయకులు పటాకులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ, పది వేల మందికి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా అప్పారెల్ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు కేటీఆర్ కృషి చేశారని కొనియాడారు. గతంలోనే అప్పారెల్ పార్క్ పరిధిలో గోకుల్‌దాస్ కంపెనీ ఏర్పాటు ద్వారా 1,500 మంది మహిళలకు ఉపాధి కల్పించారని గుర్తుచేశారు. బెంగళూరు తదితర రాష్ట్రాల్లో ఏర్పాటు చేయాలనుకున్న టెక్స్‌పోర్టు ఇండస్ట్రీ కేటీఆర్ చొరవ తీసుకుని సిరిసిల్లకు తీసుకొచ్చినట్టు తెలిపారు. 2022లోనే అప్పారెల్ పార్క్‌లో దాదాపు ఏడెకరాల స్థలం కేటాయించడంతో పాటు శంకుస్థాపన చేసినట్టు చెప్పారు.



టెక్స్‌పోర్ట్ యూనిట్‌లో మహిళలకు నియామక పత్రాలు అందజేస్తున్న మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్

# కేంద్రాన్ని రాష్ట్రాలే పోషిస్తున్నాయి

- రేషన్‌కార్డుపై మోదీ ఫొటో పెట్టాల్సిన అవసరంలేదు
- మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- అప్పారెల్ పార్క్‌లో టెక్స్‌పోర్టు ఇండస్ట్రీస్ ప్రారంభం

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 11(నమస్తే తెలంగాణ): 'రాష్ట్రంలో వసూలు చేసిన పన్నుల్లో 70 శాతం కేంద్రం తీసుకుంటూ.. 30 శాతం మాత్రమే రాష్ట్రాలకు ఇస్తున్నది.. కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్రాలే పోషిస్తున్నాయి' అని రాష్ట్ర చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. రేషన్ షాపుల్లో మోదీ ఫొటో పెట్టాలంటున్నవారు.. కేంద్రాన్ని పోషిస్తున్న అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఫొటోలు పెడుతారా.. అని ప్రశ్నించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని అప్పారెల్ పార్కులో 7.6 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన టెక్స్‌పోర్టు ఇండస్ట్రీస్ పంక్చుయేట్ వరల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్‌ను శుక్రవారం మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి మంత్రి తుమ్మల ప్రారంభించారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. టెక్స్‌పోర్టు ప్రతినిధులతో చర్చించి, పరిశ్రమను ప్రారంభించే లా చర్యలు తీసుకున్నామని చెప్పారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ టెక్స్‌పోర్ట్ కంపెనీ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

# ధర తక్కువైందని ధాన్యానికి నిప్పు

**కౌలురైతు గుండెకోత**

- మంటల్లో దూకబోయిన రైతు
- లింగరాజు అడ్డుకొని కాపాడిన తోటి రైతులు, మార్కెట్ సిబ్బంది
- సూర్యాపేట మార్కెట్లో ఘటన
- బీఆర్ఎస్ పాలనలో ఇట్లలేదన్న రైతు

సూర్యాపేట, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): ఇది ఓ కౌలు రైతు గుండెకోత.. ఐదెకరాల్లో అప్పుసప్పు చేసి పండించిన 70 బస్తాలను మార్కెట్‌లో అమ్మకానికి తెచ్చిండు.. ప్రభుత్వ మద్దతు ధర క్వింటా రూ.2,320 ఉంటే.. ఆ కౌలు రైతు ధాన్యానికి కేవలం రూ.1,606 పలికింది.. రైతు గుండె రగిలింది. పంటరాశికి నిప్పంటించి, అందులో దూకబోయాడు. పక్కనే ఉన్న తోటిరైతులు కాపాడి ఓదార్చే ప్రయత్నం చేశారు. ఇది సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో శనివారం రాష్ట్రంలోని రైతుల దుస్థితికి దర్పణం పట్టిన ఘటన. సూర్యాపేట జిల్లా మునగాల మండలం రేపాల గ్రామానికి చెందిన బత్తుల లింగరాజు గ్రామంలో 5 ఎకరాల్లో కౌలుకు వరి పొలం సాగుచేశాడు. అప్పులుచేసి సాగు చేయగా ఇటీవల చేతికి వచ్చిన 70 బస్తాల ధాన్యాన్ని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు తీసుకొచ్చాడు. వాస్తవానికి ప్రభుత్వం మద్దతు ధర క్వింటాకు రూ.2,320 ఉండగా లింగరాజు ధాన్యానికి మాత్రం క్వింటాకు రూ.1,606 మాత్రమే పలికింది. దీంతో పెట్టిన పెట్టుబడి కూడా రాలేదని ఆవేదనకు లోనయ్యాడు. ఆగ్రహంతో తాను తీసుకొచ్చిన వరిధాన్యం రాశికి నిప్పంటించగా, పక్కనే ఉన్న రైతులు మంట అంటుకున్న కుప్పను పక్కకు నెట్టారు. 'ఈ ధాన్యాన్ని కాపాడేది ఎందుకు? బీఆర్ఎస్ హయాంలో ఏనాడూ ఇలాంటి ధరలు రాలేదు.. అప్పులు తీర్చాలంటే పెండ్లాం పిల్లలను అమ్ముకోవడమో లేక నేను ఆత్మహత్య చేసుకోవడమో జరుగాలి' అంటూ నిప్పంటించిన ధాన్యంలోకి లింగరాజు దూకబోగా రైతులు, మార్కెట్ సిబ్బంది వారించి బయటకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా రైతు లింగరాజు తన ఆవేదనను వెళ్లగక్కాడు.

### రెండు రోజులుగా తిండిలేదు: లింగరాజు

రెండు రోజులుగా అన్నం తినకుండా ధాన్యం రాశి వద్దే పడుకున్నాను.. అని కౌలు రైతు లింగరాజు బోరున విలపిస్తూ చెప్పాడు. ఆరు నెలలు ఎంతో కష్టపడి పండించిన పంటకు ధర ఎక్కువ వస్తుందని సూర్యాపేట మార్కెట్‌కు తీసుకొస్తే ఖరీదుదారులు, కమీషన్‌దారులు, మార్కెట్ అధికారులు కుమ్మక్కై మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. కనీసం మద్దతు ధర కూడా రాని ఈ ధాన్యం తగల పెడదామనే నిప్పంటించిన అని చెప్పారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయితేనే రైతులకు మేలు జరుగుతుంది.. ఈ కాంగ్రెస్ పార్టీతో ఏమీ కాదు.. అని ఆవేదనతో చెప్పారు. ధర తక్కువ వచ్చినట్టు తమ దృష్టికి వచ్చిందని, ధరపై పునఃసమీక్ష చేసి రైతు లింగరాజుకు న్యాయం చేస్తామని మార్కెట్ అధికారులు హామీ ఇచ్చారు.



అదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం కొండాపూర్ శివారులో కాలిపోయిన మక్క పంట

## చేతికందిన పంటలు బుగ్గిపాలు

**ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పు రవ్వలు ఎగిసి మక్క, జొన్న పంటలు దగ్ధం**

**రూ.3.60 లక్షల నష్టం**

ఇచ్చోడ (సిరికొండ), ఏప్రిల్ 11 : ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పు రవ్వలు ఎగిసి పడటంతో రైతులకు చెందిన పంటలు కాలి బూడిదయ్యాయి. ఈ ఘటన ఆదిలాబాద్ సిరికొండ మండలం కొండాపూర్ శివారులో శుక్రవారం చోటుచేసుకున్నది. బాధిత రైతుల కథనం ప్రకారం.. సాయిని భూమన్న, సాయిని స్వామి అన్నదమ్ములు. వీరు నాలుగెకరాల్లో జొన్న, మక్క పంటలు సాగు చేశారు. సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద శుక్రవారం నిప్పు రవ్వలు ఎగిసిపడి జొన్నచేనుకు అంటుకున్నాయి. మంటలు వ్యాపించి కల్లంలో ఆరబోసిన మక్క పంట కూడా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సాయిని స్వామికి చెందిన రెండెకరాల జొన్న పంట విలువ రూ.2 లక్షలు, రూ.60 వేల విలువైన పైపులు దగ్ధంగా కాగా, భూమన్నకు చెందిన రెండెకరాల మక్క పంట దగ్ధమై రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

# విద్యుత్తు డైరెక్టర్ల ఇంటర్వ్యూల్లో గోల్‌మాల్!

మొదటిపేజీ తరువాయి...

ఆహ్వానించారు. నిబంధనల ప్రకారం డైరెక్టర్ పోస్టుకు దరఖాస్తు చేసే వారి వయస్సు 62 ఏండ్లకు మించవద్దు. విద్యుత్తు రంగంలో కనీసం 15 ఏండ్ల అనుభవం గలవారై ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో కనీసం 25 ఏండ్ల అనుభవం గల వారై ఉండాలి. ఆయా వ్యక్తులు చీఫ్ ఇంజినీర్, సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా మూడేండ్ల సర్వీసు పూర్తిచేసుకుని ఉండాలి. లేదా ప్రభుత్వరంగ సంస్థల్లో చీఫ్ జనరల్ మేనేజర్ లేదా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేసి ఉండాలి. వీరికి నెలకు రూ.1.50 లక్షల చొప్పున వేతనాలు, రూ.30 వేల నిర్వహణ ఖర్చులకు ఇస్తారు. ఏటా 10 శాతం ఇంక్రిమెంట్ ఉంటుంది.

### 16 పోస్టులకు 150 దరఖాస్తులు

ట్రాన్స్‌కోలో 3, జెన్‌కోలో 5, ఉత్తర తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థలో 4, దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థలో 4 చొప్పున మొత్తం 16 డైరెక్టర్ పోస్టులకు దరఖాస్తులను స్వీకరించారు. ఈ నాలుగు సంస్థల్లో డైరెక్టర్ పోస్టులకు దాదాపు 150 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారులకు ఈ నెల 9, 10 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. అయితే పైన పేర్కొన్న అర్హతల్లేని కొందరిని ఇంటర్వ్యూలకు పిలవడంపైనే అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా ఇంటర్వ్యూలు పూర్తికాగా, ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున షార్ట్‌లిస్టు చేసి ప్రభుత్వానికి కమిటీ సిఫారసు చేసే పనిలో ఉన్నది. ఆ తర్వాత వీరిలో ఒకరిని డైరెక్టర్‌గా నియమిస్తారు.

### కోట్లు ముట్టజెప్పినట్టు గుసగుస!

విద్యుత్తు సంస్థల్లో డైరెక్టర్ పోస్టులకు భారీ గిరాకీ పలికిందని విద్యుత్తు శాఖ ఇంజినీర్లలో విస్తృత ప్రచారం జరుగుతున్నది. సీఎండీ తర్వాత డైరెక్టర్ పోస్టులే కీలకం కావడంతో భారీ మొత్తంలో చేతులు మారాయని అనుకుంటున్నారు. ముఖ్యంగా ఆపరేషన్స్ డైరెక్టర్ పోస్టుకు తీవ్ర డిమాండ్ ఉన్నదని వినికిడి. ఒక్కో పోస్టుకు కొందరు రూ.రెండు, రూ.మూడు కోట్లు సమర్పించుకున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. భారీ మొత్తంలో చేతులు మారడంతోనే ఇంటర్వ్యూ జాబితాలో అనర్హుల పేర్లు చేరాయని అంటున్నారు. అర్హతలు ఉన్న వారితోపాటు లేని వారిని సైతం ఇంటర్వ్యూలకు పిలవడమేమిటని ఇతరులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో కొందరు ప్రభుత్వ పెద్దల జోక్యం ఉన్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారి ప్రమేయంతోనే అనర్హులను ఇంటర్వ్యూ చేశారని, వారికే డైరెక్టర్ పోస్టులు ఖాయం అవుతాయని చర్చించుకుంటున్నారు. నోటిఫికేషన్ నిబంధనలు మార్చకుండా, అనర్హులను ఇంటర్వ్యూలకు పిలవడం వెనుక ముందస్తు కుట్ర దాగి ఉన్నదని ఇతర ఇంజినీర్లు భగ్గుమంటున్నారు. ముందే నిబంధనలు మారిస్తే, తాము కూడా దరఖాస్తు చేసుకునే వారిమని, దీనిపై కోర్టులో తేల్చుకుంటామని కొందరు ఇంజినీర్లు హెచ్చరిస్తున్నారు.

**కొన్ని ఉదాహరణలు ఇలా..**

- టీజీఎస్పీడీసీఎల్‌లో డైరెక్టర్ పోస్టుల కోసం మొత్తం 55 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ఏడుగురు అనర్హులు ఉన్నారు.
- డైరెక్టర్ కమర్షియల్ పోస్టుకు ప్రసాద్ (పేరు మార్చాం) అనే అధికారి దరఖాస్తు చేసుకోగా, ఆయనకు ఎలాంటి అర్హతలూ లేవు. కానీ ఇంటర్వ్యూకు పిలిచారన్న ఆరోపణలు ఉన్నాయి.
- రమేశ్ (పేరు మార్చాం) అనే సర్వీస్‌లో ఉన్న అధికారికి ఒక అర్హత మాత్రమే ఉన్నది. ఇతర రెండు రకాల అర్హతలు లేవు. అయినా ఇంటర్వ్యూ జాబితాలో సదరు అధికారి పేరున్నది. ఆయన ఆపరేషన్స్, కమర్షియల్ రెండు పోస్టులకు దరఖాస్తు చేసుకోవడం గమనార్హం.
- ఫైనాన్స్ డైరెక్టర్ పోస్టు కోసం సర్వీస్‌లో ఉన్న కృష్ణ (పేరు మార్చాం) అనే అధికారికి మూడురకాల అర్హతలూ లేవు. అయినా ఇంటర్వ్యూలకు పిలిచారు.
- ట్రాన్స్‌కోలో శ్రీనివాస్, కే బాబుకు (పేర్లు మార్చాం) అర్హతలు లేకపోయినా ఇంటర్వ్యూకు పిలిచారు.

## పొలం ఎండిందని రైతు ఆత్మహత్య

**మాల్తుమ్మెదలో విషాదం**

ఎల్లారెడ్డి రూరల్ (నాగిరెడ్డిపేట్), ఏప్రిల్ 11: పొలం ఎండిపోవడంతోపాటు అప్పుల బాధ తాళలేక ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాదకర ఘటన కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండలం మాల్తుమ్మెద గ్రామంలో చోటుచేసుకున్నది. ఎస్సై మల్లారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మాల్తుమ్మెదకు చెందిన మోరె రాజు (35) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. గ్రామ శివారులో ఉన్న ఎకరం భూమిలో వరి వేశాడు. గత జనవరిలో రాజు రెండు బోర్లు వేయించగా, కొన్ని నీళ్లు మాత్రమే పడ్డాయి. అవి సరిపోక పొలం ఎండిపోయింది. సాగుకు పెట్టిన పెట్టుబడితోపాటు బోర్లు వేయడానికి తెచ్చిన అప్పులు మీద పడటంతో రాజు మనస్తాపానికి గురయ్యాడు. గురువారం సాయంత్రం ఇంటి నుంచి పొలానికి వెళ్లిన ఆయన అక్కడే చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



యాదాద్రి భువనగిరి జిల్లా బస్వాపూర్ వద్ద నిర్మించిన రిజర్వాయర్

# 'బస్వాపూర్' గట్టుకు తూట్లు

- ఆనకట్టను తవ్వుతూ భారీ విద్యుత్తు లైన్లు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు
- ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు
- పనులతో ఇబ్బందేమీ లేదంటున్న ఇరిగేషన్ శాఖ

హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): యాదాద్రి భువనగిరి జిల్లా బస్వాపూర్ వద్ద నిర్మించిన రిజర్వాయర్ కట్టను తవ్వి భారీ విద్యుత్తు లైన్లను నిర్మిస్తున్నారని, ఫలితంగా ప్రమాదం ఏర్పడే అవకాశం ఉన్నదని గ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం ఆ గ్రామానికి చెందిన బాలస్వామి, నర్సింహ ఆధ్వర్యంలో పలువురు గ్రామస్థులు ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా 11.39 టీఎంసీల సామర్థ్యంతో, 13.73 కిలోమీటర్ల పొడవుతో బస్వాపూర్ రిజర్వాయర్‌ను నిర్మించారని వివరించారు. అయితే, ప్రస్తుతం రిజర్వాయర్ టోల్ డ్రెయిన్‌ను పూర్తిగా తొలగిస్తూ 33 కేవీకి సంబంధించి 14 విద్యుత్తు లైన్ల టవర్లను ఏర్పాటు చేస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఆనకట్టను సైతం కొద్దిమేర ధ్వంసం చేస్తున్నారని పేర్కొన్నారు. ఫలితంగా సీపేజీ సజావుగా సాగకపోవడంతోపాటు కట్ట బలహీనమై పోతుందని, కట్టకు ఏదైనా జరిగితే దిగువన ఉన్న అనేక గ్రామాలతోపాటు యాదగిరిగుట్ట దేవస్థానానికి సైతం ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ శాఖ అధికారులు వెంటనే స్పందించాలని, విద్యుత్తు లైన్ల పనులను నిలిపివేయించాలని కోరారు. పనులకు సంబంధించిన ఫొటోలను కూడా ఈ సందర్భంగా అధికారులకు అందజేశారు. దీనిపై ఇరిగేషన్ శాఖ అధికారులను సంప్రదించగా, పనులతో అలాంటి ఇబ్బందేమీ లేదని పేర్కొన్నారు. కరెంటు టవర్లను వేసిన అనంతరం తిరిగి యథాప్రకారం వాటిని భర్తీ చేస్తారని వెల్లడించారు.

